మీర్‌పేట్ స్కూల్‌ను సందర్శించిన సబితారెడ్డి


మీర్‌పేట్ స్కూల్‌లో చిన్నారులతో ముచ్చటిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

సరూర్‌నగర్, జూలై 19(ఆంధ్రజ్యోతి): మహేశ్వరం ఎమ్మెల్యే పీ.సబితా రెడ్డి శుక్రవారం మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని ధాతునగర్‌లో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడి చిన్నారులతో కాసేపు ముచ్చటించారు. అనంతరం వారికి నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సబిత మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా తీర్చిదిద్దిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని మరింత మెరుగ్గా తీర్చిదిద్దడానికి చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ కార్పొరేటర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌లపై అక్రమ నిర్మాణాల కూల్చివేత


అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న మున్సిపల్ అధికారులు

వనస్థలిపురం, జూలై 19(ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా రోడ్లకు ఇరువైపుల ఉన్న ఫుట్‌పాత్‌లను ఆక్రమించి నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని జీహెచ్ఎంసీ అధికారులు తెలిపారు. శుక్రవారం బీఎన్ రెడ్డినగర్ లోని ప్రధాన రహదారికి ఇరువైపుల ఫుట్‌పాత్‌లను వ్యాపారులు ఆక్రమించడంతో వాహనదారులకు, బాటసారులకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని కాలనీవాసుల ఫిర్యాదుతో అధికారులు తమ సిబ్బందితో ఫుట్‌పాత్ లపై ఏర్పాటు చేసిన షెడ్‌లు, తోపుడు బండ్లు, ఇతర వాణిజ్య సముదాయాలను కూల్చివేశారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

హయత్‌నగర్‌లో భవనం..

హయత్‌నగర్, జూలై 19(ఆంధ్రజ్యోతి): కోర్టు ఆదేశం మేరకు హయత్‌నగర్‌లోని భాగ్యనగర్ కేఫ్ భవనం కింది పోర్షన్‌ను హయత్‌నగర్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులు శుక్రవారం కూల్చివేశారు. స్టీల్ ఫ్లస్-2 అనుమతి ఉన్నప్పటికీ కింది పోర్షన్‌లో పార్కింగ్‌కు బదులుగా కేఫ్ నిర్వహిస్తున్నారు. భవనానికి ఉన్న షట్టర్లు, మెట్లు తొలగించారు. కేఫ్ పక్కనే ఉన్న భూమి యజమాని కోర్టుకు పోయాడు. అనధికారికంగా పార్కింగ్ స్థలంలో వ్యాపారం నిర్వహిస్తున్నాడని కోర్టుకు వెళ్లడంతో కోర్టు సదరు కేఫ్‌ను తొలగించాలని ఆదేశాలు జారీ చేసింది. దీంతో టౌన్ ప్లానింగ్ అధికారులు కూల్చివేశారు. కార్యక్రమంలో హయత్‌నగర్ సర్కిల్ ఏసీపీ పావనీ, సెక్షన్ ఆఫీసర్ మన్సూర్‌తో పాటు టౌన్ ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

వరదనీరు నిలవకుండా సీసీ రోడ్లను నిర్మించాలి

చాదర్‌ఘాట్, జూలై 19(ఆంధ్రజ్యోతి): వర్షం కురిసినప్పుడు వరదనీరు రోడ్లపై నిలవకుండా సీసీ రోడ్లను నిర్మించేలా జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీరెడ్డి సూచించారు. శుక్రవారం మూసారాంబాగ్ డివిజన్‌లోని సాయినగర్ నాలా కిరువైపులా రూ.6.7లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు పనులను ఆమె ప్రారంభించారు. మూసారాంబాగ్ బస్తీవాసులు గడ్డం నర్సింహ, సిద్ధు, సంతోష్, ఉదయ్, ఉమేష్, దినేష్ పాల్గొన్నారు.

విద్యుత్ మీటర్లు మంజూరు చేయాలి

సైదాబాద్, జూలై 19(ఆంధ్రజ్యోతి): సింగరేణి గుడిసెవాసులకు విద్యుత్ మీటర్లు మంజూరు చేయాలని కోరుతూ సేవాలాల్ బంజారా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కోర్ర మోతీలాల్‌నాయక్ ఆధ్వర్యంలో గుడిసెవాసులు శుక్రవారం చంపాపేట విద్యుత్ డీఈకి వినతిపత్రం అందజేశారు. 30ఏళ్లుగా పేదలు గుడిసెలు వేసుకుని జీవిస్తున్నారని, అయినా విద్యుత్ మీటర్లు ఇవ్వకపోవడం దారుణమని అన్నారు. విద్యుత్ మీటర్లు కేటాయించకపోవడంతో గత్యంతరం లేక అనధికారికంగా విద్యుత్ వాడాల్సిన పరిస్థితి ఉందని తెలిపారు. దీంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. అధికారులు స్పందించి ప్రతి గుడిసెకు విద్యుత్ మీటర్లు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నేతలు జంగయ్య, గణేష్‌నాయక్, దేవానాయక్, మోహన్‌నాయక్, శాంతిబాయ్, హుస్సేనీబాయ్, జయమ్మగౌడ్ పాల్గొన్నారు.

తుర్కయంజాల్ మున్సిపాలిటీలో డ్రైడే ఫ్రైడే

హయత్‌నగర్, జూలై 19(ఆంధ్రజ్యోతి): తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని 24 వార్డులలో శుక్రవారం డ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మురుగునీటి కాల్వలో దోమల నివారణ మందులు పిచికారీ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ అమరేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలందరూ డ్రైడే ఫ్రైడే కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. వర్షం నీరు నిల్వ ఉండకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. పాత టైర్లు, కూలర్లు, కొబ్బరి బొండాలలో నీరునిల్వ ఉండడం వల్ల దోమలు వృద్ధి చెందే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ అలాంటి వస్తువుల్లో నీరునిల్వ ఉండకుండా జాగ్రత్త తీసుకోవాలన్నారు. అపరిశుభ్ర పరిసరాలలో బ్లీచింగ్ చల్లారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ మేనేజర్ శ్రీధర్‌రెడ్డి, శానిటరి ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ పాల్గొన్నారు.


దోమల నివారణకు జాగ్రత్తలు పాటించాలి

చంపాపేట, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : దోమల నివారణ కోసం ప్రతి ఒక్కరూ తగు జాగ్రత్తలు పాటించాలని కార్పొరేటర్ సుజాతానాయర్ కోరారు. హస్తినాపురం డివిజన్‌లోని హనుమాన్‌నగర్ కాలనీలో శుక్రవారం జీహెచ్ఎంసీ ఎంటమాలజీ ఆధ్వర్యంలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా దోమల నివారణపై కాలనీ ప్రజలు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలలో నీరు నిల్వకుండా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, సతీష్‌గౌడ్, నర్సింహ, గంధం శ్రీనివాస్ పాల్గొన్నారు.

సికింద్రాబాద్-పాట్నా, ధనపూర్ మార్గాల్లో ప్రత్యేక రైళ్లు

హైదరాబాద్/హైదరాబాద్ సిటీ, జూలై 19 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ నుంచి ఆయా ప్రాంతాలకు వెళ్లి వచ్చే ప్రత్యేక రైళ్లను సెప్టెంబర్ చివరి వారం వరకు పొడిగించినట్టు దక్షిణమధ్యరైల్వే అధికారులు తెలిపారు. పాట్నా-సికింద్రాబాద్ ప్రత్యేక రైలు(నం.03253) ఆగస్టు 5నుంచి సెప్టెంబర్ 30వరకు(సోమ-బుధవారం) హైదరాబాద్-పాట్నా ప్రత్యేక రైల్(07255) ఆగస్టు 7 నుంచి అక్టోబర్ 2వరకు(బుధవారం), సికింద్రాబాద్-పాట్నా ప్రత్యేక రైల్(నం.07256) ఆగస్టు 9 నుంచి సెప్టెంబర్ 27 వరకు(శుక్రవారం), ధనపూర్-సికింద్రాబాద్ ప్రత్యేక రైల్(నం.03225) ఆగస్టు 1 నుంచి సెప్టెంబర్ 26 వరకు(గురువారం), సికింద్రాబాద్-ధనపూర్ ప్రత్యేక రైల్(నం.03226) ఆగస్టు 4 నుంచి సెప్టెంబర్ 29 వరకు(ఆదివారం) పొడిగించినట్టు రైల్వే అధికారులు తెలిపారు.

ఇంటింటా ఇన్నోవేటర్ ఆవిష్కరణలకు దరఖాస్తులకు ఆహ్వానం



హైదరాబాద్ సిటీ, జూలై 19(ఆంధ్రజ్యోతి): ఇంటింటా ఇన్నోవేటర్ ఆవిష్కరణలకు సంబంధించి ఆసక్తి కలిగిన వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సైన్స్ అధికారి ధర్మేందర్‌రావు తెలిపారు. ఆసక్తి కలిగిన వారు తమ పేరు, వయసు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, చిరునామా, మండలం, జిల్లా, ఆవిష్కరణ పేరు, చేపట్టిన ఆవిష్కరణను వివరిస్తూ 100 పదాలలో రాసి పంపాలని సూచించారు. అలాగే, ఆవిష్కరణకు సంబంధించిన నాలుగు ఫొటోలు లేదా ఆవిష్కరణ వీడియోకు చెం దిన 2 నిమిషాల నిడివిని పోస్టర్‌లో ఇచ్చిన క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి వాట్సాప్ నంబర్ 9100678543కు పంపించాలన్నారు. ఆగస్టు 3లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు జిల్లా సైన్స్ అధికారి ధర్మేందర్‌రావు 7799171299, ఇన్నోవేషన్ మిత్రా వినీత్ సిద్ధార్థ 8712824996 లో సంప్రదించాలని సూచించారు.

నేడు ఐఐటీహెచ్ స్నాతకోత్సవం

కంది: సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హైదరాబాద్‌లో జరిగే స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా నీతి అయోగ్ సీఈఓ బీవీఆర్ సుబ్రమణ్యం హాజరుకానున్నారు. శనివారం ఉదయం 10గంటలకు ఐఐటీ హైదరాబాద్ వేదికగా బీటెక్, ఎంటెక్, పీహెచ్‌డీలలోని వివిధ విభాగాలకు చెందిన దాదాపు 1,100 మంది విద్యార్థులు డిగ్రీ పట్టాలు అందుకోనున్నారు. గత సంవత్సరం ఇస్రో ఛైర్మన్ సోమ్‌నాథ్ చేతుల మీదుగా 980 మంది విద్యార్థులు పట్టాలు స్వీకరించారు. అందులో నలుగురు గోల్డ్ మెడల్స్, 38మంది సిల్వర్ మెడల్స్ సాధించారు. ఈ సంవత్సరం ఐఐటీ హైదరాబాద్‌లో డిగ్రీ పట్టాలు అందుకునే విద్యార్థుల సంఖ్య వెయ్యి దాటబోతుందని ఐఐటీ-హెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి వెల్లడించారు.

మీర్‌పేట్ డిప్యూటీ మేయర్‌పై వీగిన అవిశ్వాసం

- ఇద్దరు బీజేపీ, నలుగురు కాంగ్రెస్ సభ్యులు గైర్హాజరు
- కావాల్సిన బలం 31.. హాజరయింది 26 మందే
- కోరమ్ లేనందున అవిశ్వాసం వీగినట్టు ప్రకటించిన ఆర్వో

సరూర్‌నగర్, జూలై 19(ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ తీగల విక్రమ్‌రెడ్డిపై 31 మంది బీజేపీ, కాంగ్రెస్ సభ్యులు పెట్టిన అవిశ్వాసం వీగిపోయింది. అవిశ్వాసం నెగ్గడానికి 31 మంది సభ్యులు అవసరం కాగా, శుక్రవారం ఎన్నికల అధికారి, కందుకూరు ఆర్డీవో సూరజ్‌కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశానికి కేవలం 26 మంది సభ్యులు మాత్రమే హాజరయ్యారు. దాంతో సరైన 'కోరమ్' లేనందున అవిశ్వాసం వీగిపోయిందని ఆర్వో ప్రకటించారు.

కంగు తినిపించిన 'కమలం' సభ్యులు

ఊహించని విధంగా ఇద్దరు బీజేపీ సభ్యులు ఈ సమావేశానికి గైర్హాజరు కావడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. 21 మంది బీజేపీ సభ్యులు, 10 మంది కాంగ్రెస్ సభ్యులు అవిశ్వాస తీర్మానం కాపీపై సంతకాలు చేయగా, శుక్రవారం నాటి సమావేశానికి ఇద్దరు బీజేపీ సభ్యులు డుమ్మా కొట్టడంతో కమలం పార్టీ నేతలు కంగుతిన్నారు. సమావేశానికి ముందు స్థానికంగా గల ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ నేతలు మాట్లాడుతూ తమ 21 మంది సభ్యులు ఏకతాటిపై ఉన్నారని, కాంగ్రెస్ సభ్యులు బీఆర్ఎస్‌కు అమ్ముడుపోకుండా తమ వెంట వస్తే డిప్యూటీ మేయర్‌ను దించేయొచ్చునని పిలుపునిచ్చారు. అయితే అనూహ్యంగా సొంత పార్టీకి చెందిన ఇద్దరు సభ్యులు ముఖం చాటేయడంతో బీజేపీ


అవిశ్వాసం వీగిపోయిన తర్వాత బయటకు వచ్చిన బీజేపీ, కాంగ్రెస్ సభ్యులు

నేతలు దిమ్మరపోయారు. 19 మంది బీజేపీ సభ్యులు మాత్రమే సమావేశంలో పాల్గొనడంతో ఆ పార్టీ పరిస్థితి సైతం అయోమయంగా మారింది.

'చేయి'చ్చిన నలుగురు 'హస్తం' సభ్యులు

మరోపక్క 11 మంది సభ్యులు ఉన్న కాంగ్రెస్ నుంచి శుక్రవారం నాటి సమావేశానికి ఏడుగురు మాత్రమే హాజరయ్యారు. అంతా కలిసి బీఆర్ఎస్‌ను గద్దె దించాలని భావించినప్పటికీ కాంగ్రెస్‌కు చెందిన నలుగురు సభ్యులు గైర్హాజరు కావడంతో అవిశ్వాసంపై ఎన్నో ఆశలు పెట్టుకున్న నేతలు తెల్లముఖమేశారు. వాస్తవానికి మేయర్‌పై అవిశ్వాసం పెట్టినప్పుడు డుమ్మా కొట్టిన కాంగ్రెస్‌కు చెందిన ఇద్దరు సభ్యులు శుక్రవారం నాటి సమావేశానికి సైతం రాకపోవచ్చునని బీజేపీ నేతలు భావించారు. విలేకరుల సమావేశంలోనూ సదరు ఇద్దరు సభ్యులను పరోక్షంగా ప్రస్తావిస్తూ.. కాంగ్రెస్‌లోని ఒక వర్గం ఎమ్మెల్యే సబితకు తొత్తుగా మారిందని, వారు అవిశ్వాసానికి మద్దతు ఇవ్వకపోవడం వారి మధ్య ఉన్న 'రాజకీయ సంబంధానికి' నిదర్శనమని ఆరోపించారు. తీరా సమావేశానికి సదరు ఇద్దరు సభ్యులే బీజేపీ సభ్యులకన్నా ముందుగా సమావేశం హాల్‌లోకి వచ్చి కూర్చోవడంతో బీజేపీ నేతలు సైతం నోరెళ్లబెట్టారు. మరో నలుగురు కాంగ్రెస్ సభ్యులు మాత్రం ముఖం చాటేశారు. తాజాగా వారి వ్యవహారంపై బీజేపీ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

26 మందే వచ్చారు.. కోరమ్‌కు సరి పోలేదు: ఆర్వో


వివరాలు వెల్లడిస్తున్న ఆర్వో సూరజ్‌కుమార్

ప్రత్యేక సమావేశానికి 31 మంది సభ్యుల హాజరు తప్పనిసరి కాగా, కేవలం 26 మంది మాత్రమే వచ్చారని, దాంతో కోరమ్ లేనందున సమావేశం నిర్వహించలేదని, ఈ దృష్ట్యా అవిశ్వాసం వీగిపోయిందని ఆర్వోగా వ్యవహరించిన కందుకూరు ఆర్డీవో సూరజ్‌కుమార్ తెలిపారు. 11 గంటల నుంచి 11.30 వరకు ఒక్కరు కూడా రాకపోవడంతో సమావేశాన్ని 12గంటలకు వాయిదా వేశామని, ఆ సమయానికి 19 మంది బీజేపీ సభ్యులు, 7గురు కాంగ్రెస్ సభ్యులు కలిపి మొత్తం 26 మంది వచ్చారని ఆయన పేర్కొన్నారు. దీనికి సంబంధించిన నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందజేస్తామని ఆయన చెప్పారు. కాగా ప్రత్యేక సమావేశం నేపథ్యంలో వనస్థలిపురం ఏసీపీ పల్లె కాశీరెడ్డి, మీర్‌పేట్ ఇన్‌స్పెక్టర్ కీసరి నాగరాజు ఆధ్వర్యంలో గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

- మాజీ ఎమ్మెల్యేలు కేఎల్లార్, తీగల

సరూర్‌నగర్, జూలై 19(ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని అన్నదాతల సంక్షేమానికి సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని మాజీ ఎమ్మెల్యేలు కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి, తీగల కృష్ణారెడ్డి అన్నారు. రైతు రుణమాఫీ పథకం ప్రారంభించిన నేపథ్యంలో శుక్రవారం మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని బాలాపూర్ చౌరస్తాలో టీపీసీసీ రాష్ట్ర ప్రచార కమిటీ సభ్యుడు సామిడి గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు పాల్గొని సీఎం ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. అనంతరం కేఎల్లార్, తీగల మాట్లాడుతూ ఆగస్టు 15లోగా తమ ప్రభుత్వం రూ.2లక్షల వరకు ఉన్న రైతులందరి రుణాలను మాఫీ చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో రంగారెడ్డి జడ్పీచైర్మన్ తీగల అనితాహరినాథ్‌రెడ్డి, టీపీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి, కాంగ్రెస్ కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

తెలంగాణ రైతాంగం గర్వపడే దినం

వనస్థలిపురం: రుణమాఫీతో తెలంగాణ రైతాంగం ఎంతగానో గర్వపడుతుందని కాంగ్రెస్ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్ఆర్ హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆర్కేపురం డివిజన్ కాంగ్రెస్ యువజన నాయకుడు చిలుక ఉపేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు రుణమాఫీ సంబరాలకు కేఎల్ఆర్, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డిలు ముఖ్య అతిథిగా హాజరై సీ ఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో టీపీసీసీ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి, నాయకులు పున్న గణేష్, పిట్ట హరినాథ్‌రెడ్డి, మధుసూదన్‌రావు, జ్ఞానేశ్వర్‌యాదవ్ పాల్గొన్నారు.


బాలాపూర్ చౌరస్తాలో రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న కేఎల్లార్, తీగల తదితరులు

రుణమాఫీ సాహసోపేత నిర్ణయం

ఎల్‌బీనగర్: తెలంగాణలో రైతు రుణమాఫీ సాహసోపేత నిర్ణయమని, సీఎం రేవంత్ రెడ్డి ఏడు నెలల్లోనే చేసి చూపించారని రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు నల్లేంకి ధన్‌రాజ్‌గౌడ్, బోయిని శంకర్‌యాదవ్‌లు సీఎం రేవంత్‌రెడ్డి రుణమాఫీ పథకం ప్రారంభించిన సందర్భంగా శుక్రవారం సరూర్‌నగర్‌లో కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు జరుపుకుని రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు బేర బాలకిషన్, బోయిని మహేందర్‌యాదవ్, ఇమ్రాన్‌అలీ, అరుణ, నీలకంఠ, నాగమణి, సంగీత, సంతోష్, నయీమ్ షఫీ, అలీబాయ్, జంగారెడ్డి, శివప్రసాద్, జనార్దన్, గంగం కిషోర్ కుమార్ పాల్గొన్నారు.

మలక్‌పేట మార్కెట్‌లో..

చాదర్‌ఘాట్: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతులకు రుణమాఫీ చేసి చరిత్రలో కెక్కిన సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి మహ్మద్ సోహెల్ ఉద్దీన్ ఆధ్వర్యంలో మలక్‌పేట మార్కెట్‌లో శుక్రవారం సంబరాలు జరుపుకున్నారు.

వనస్థలిపురం: తెలంగాణ ప్రభుత్వం రైతు రుణమాఫీ చేసినందుకు గాను సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతగా ఎల్బీనగర్ కాంగ్రెస్ ఎస్టీసెల్ ఆధ్వర్యంలో ఎల్బీనగర్‌లోని రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో రమావత్ చందునాయక్, శ్రీనివాస్‌నాయక్, రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.


చైన్‌స్నాచర్‌లను పట్టుకున్న సీసీఎస్ సిబ్బందిని అభినందిస్తున్న సీపీ

తప్పు చేస్తే ఉపేక్షించేది లేదు : సీపీ సుధీర్‌బాబు

హైదరాబాద్ సిటీ, జూలై 19(ఆంధ్రజ్యోతి): మహిళలపై నేరాలు, వేధింపులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని రాచకొండ సీపీ సుధీర్‌బాబు హెచ్చరించారు. కమిషనరేట్ పరిధిలో నమోదైన కేసుల్లో వేగవంతమైన దర్యాప్తు ద్వారా నేరస్థులకు గరిష్ఠ శిక్ష పడేలా పని చేస్తున్నామని తెలిపారు. నేరాలను అదుపులో ఉంచడానికి అన్ని రకాల చట్టపరమైన భద్రతా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. రాచకొండ అధికారుల, సిబ్బంది సమర్థవంతమైన పని తీరు వల్ల శిక్షల రేటు పెరుగుతోందని, నేరాల శాతం క్రమేపీ తగ్గుతోందని తెలిపారు. ఇటీవల ఎల్‌బీనగర్, వనస్థలిపురం, సరూర్‌నగర్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో జరిగిన చైన్‌స్నాచింగ్ కేసుల్లో నిందితులను 24గంటల వ్యవధిలో పట్టుకున్న సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, కానిస్టేబుళ్లు రాజ్‌కుమార్, శాంతిస్వరూప్, ఎస్ శ్రీనివాస్‌లను సీపీ సుధీర్‌బాబు అభినందించారు. క్రైం డీసీపీ అరవింద్‌బాబు ఆధ్వర్యంలో నేరేడ్‌మెట్ కమిషనరేట్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారికి రివార్డులు అందించి అభినందించారు. భవిష్యత్తులో కూడా ఇదే విధంగా చక్కటి పని తీరు కనబరచాలని సీపీ కోరారు.

చెరువులను ఆక్రమిస్తే చర్యలు..!

- ఫతుల్లగూడ చెరువును సందర్శించిన రంగనాథ్

హైదరాబాద్ సిటీ, జూలై 19(ఆంధ్రజ్యోతి): నగరంలోని చెరువుల ఆక్రమణకు పాల్పడితే చర్యలు తప్పవని హైడ్రా కమిషనర్ రంగనాథ్ హెచ్చరించారు. ఫిర్యాదుల నేపథ్యంలో శుక్రవారం ఫతుల్లగూడ చెరువును ఆయన పరిశీలించారు. చెరువు వాస్తవ విస్తీర్ణం ఎంత..? ప్రస్తుత విస్తీర్ణం ఎంత..? ఏప్రాంతాల్లో ఆక్రమణకు గురైంది..? ఎలాంటి నిర్మాణాలు చేపట్టారు..? అన్నది తెల్సుకున్నారు. ముమ్ముందు ఆక్రమణలు జరగకుండా చేపట్టాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు.

స్వచ్ఛంద సంస్థలతో చర్చలు..

చెరువుల పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించేందుకు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, సామాజిక కార్యకర్తలతో రంగనాథ్ సమావేశమయ్యారు. చెరువుల ఆక్రమణతో వరద నీరు పరిసర ప్రాంతాల్లోని కాలనీలు, బస్తీలు ముంపునకు గురవుతున్నాయని వారు తెలిపారు. కబ్జాలతో పర్యావరణ సమతుల్యమూ దెబ్బతింటుందని పేర్కొన్నారు. చెరువుల పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.

ఘనంగా విఠలస్వామి, రుక్మిణిల రథయాత్ర

చాదర్‌ఘాట్, జూలై 19(ఆంధ్రజ్యోతి): మూసారాంబాగ్‌లోని శ్రీవిఠల రుక్మిణి మందిర్‌లో ఆషాఢ శుద్ధ ఏకాదశిని పురస్కరించుకుని స్వామి రథయాత్ర మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. మూడు రోజులపాటు జరిగిన ఉత్సవాలు శుక్రవారం ముగిశాయి. తెలంగాణ మరాఠా సమాజ్ ఆధ్వర్యంలో జరిగిన ఉత్సవంలో విఠలస్వామి, రుక్మిణి అమ్మవారి ఉత్సవ మూర్తులను రథంపై ఏర్పాటు చేసి భజన కీర్తనల నడుమ ఆధ్యాత్మికతతో సాగింది. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మరాఠాలతోపాటు, మహారాష్ట్ర నుంచి ప్రత్యేకంగా ఈ ఉత్సవం కోసం విచ్చేసి ప్రత్యేక పూజలు, భజన కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో సమాజ్ సెంట్రల్ కమిటీ అధ్యక్షుడు సుందర్‌రావు వాగ్‌మారే, ఉపాధ్యక్షుడు రాజేష్ వాగ్‌మారే, ప్రధాన కార్యదర్శి నటేష్‌రావు జోగ్‌డే, సంయుక్త కార్యదర్శి అశోక్‌రావు సదాపాలే, కోశాధికారి లక్ష్మణ్‌రావు కాంబ్లే పర్యవేక్షణలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

శాకాంబరీ అలంకారంలో విజయదుర్గామాత

సైదాబాద్, జూలై 19(ఆంధ్రజ్యోతి): ఆషాఢమాసం పురస్కరించుకుని శుక్రవారం సైదాబాద్ మాతామైదాన్‌లోని విజయదుర్గామాత శాకాంబరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈనెల 28న బోనాల వేడుకలు నిర్వహించనున్న సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. దాదాపు 25 రకాల కూరగాయలు, ఆకుకూరలతో కనులపండువగా అలంకారం చేశారు. అమ్మవారి దర్శనానికి సైదాబాద్ పరిసరాలతో పాటు నగరంలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. ప్రధాన అర్చకుడు సుద్దాల లక్ష్మీనర్సింహారావు అమ్మవారికి సుప్రభాతసేవ, నిత్యాహ్నికం, క్షీరాన్నం నివేదించారు.

నేడు బడంగ్‌పేట్‌కు మంత్రి శ్రీధర్‌బాబు, స్పీకర్ ప్రసాద్‌కుమార్ రాక

సరూర్‌నగర్, జూలై 19(ఆంధ్రజ్యోతి): ఐటీశాఖ మంత్రి డీ.శ్రీధర్‌బాబు, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ శనివారం బడంగ్‌పేట్‌కు రానున్నారని, కార్పొరేషన్ పరిధిలోని డివిజన్లలో రూ.38కోట్ల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు వారు శంకుస్థాపన చేయనున్నారని మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి తెలిపారు. శుక్రవారం తన ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మహేశ్వరం ఎమ్మెల్యే పీ.సబితారెడ్డి సైతం హాజరుకానున్నారని, మాజీ ఎమ్మెల్యేలు కేఎల్లార్, తీగల కృష్ణారెడ్డితో కలిసి ఆయా అభివృద్ధి పనులకు శనివారం ఉదయం శంకుస్థాపన చేయనున్నారని వెల్లడించారు. అనంతరం వన మహోత్సవం, ఆరు గ్యారెంటీల అమలుపై సంబరాలు సైతం నిర్వహించనున్నట్టు ఆమె తెలిపారు.

టీజీడీఎస్‌సీ పరీక్షకు 347మంది అభ్యర్థులు హాజరు

కొత్తపేట, జూలై 19(ఆంధ్రజ్యోతి): కొత్తపేట న్యూ నాగోల్‌లో సీఐఓఎస్ డిజిటల్ ప్రై.లి.లో శుక్రవారం ఆన్‌లైన్ టీజీడీఎస్‌సీ పరీక్షకు 347 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఉదయం షిఫ్ట్‌లో 185 మంది అభ్యర్థులకు గాను 174 మంది హాజరు కాగా మధ్యాహ్నం షిఫ్ట్‌లో 185 మందికి గాను 173 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఉదయం షిఫ్ట్‌లో 11మంది, మధ్యాహ్నం షిఫ్ట్‌లోనూ 12 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు.

కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయండి

వనస్థలిపురం, జూలై 19(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 22న ఎస్ఎఫ్ఐ ఎల్బీనగర్‌శాఖ ఆధ్వర్యంలో చేపట్టే కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలని ఎల్బీనగర్ అధ్యక్షుడు కానుగుల అరుణ్, ప్రధాన కార్యదర్శి స్టాలిన్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం సరూర్‌నగర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఎస్ఎఫ్ఐ నాయకులతో కలిసి కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు పవన్ యాదవ్, శ్రీకాంత్, నవీన్, ఉదయ్, సురేష్, సాయి, శివ, వెంకటేశ్ పాల్గొన్నారు.

ప్రజల ఆర్థిక అవసరాల కోసం సొసైటీలు పనిచేయాలి

వనస్థలిపురం: ప్రజల ఆర్థిక అవసరాలను నెరవేర్చడానికి సొసైటీలు పనిచేయాలని తెలంగాణ ప్రభుత్వ అడిషనల్ సెక్రటరీ సైదా అన్నారు. శుక్రవారం బీఎన్‌రెడ్డినగర్‌లోని శ్రీకర మ్యూచివల్లి ఎయిడెడ్ కోఆపరేటీవ్ సొసైటీ రీజినల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జీహెచ్ఎంసీ జాయింట్ కమిషనర్ వెంకట్‌రెడ్డితో కలిసి సైదా ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తొమ్మిదేళ్లుగా ఈ సొసైటీ ద్వారా ప్రజలకు బ్యాంకింగ్‌కు సమాంతరంగా సేవలు అందించడం అభినందనీయం అన్నారు. ప్రజల ఆర్థిక అవసరాలు నెరవేర్చడానికి దృఢసంకల్పంతో పేద, మధ్యతరగతి కుటుంబాల అభ్యున్నతికి కృషిచేయాలని సూచించారు. సొసైటీ సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

130 మంది డ్రైవర్లు, కండక్టర్లకు ప్రగతి చక్ర అవార్డులు


ప్రతిభ కనబరచిన డ్రైవర్లు, కండక్టర్లకు ప్రగతి చక్ర అవార్డులను అందజేస్తున్న ఆర్టీసీ దిల్‌సుఖ్‌నగర్ డిపో మేనేజర్ హరి

చాదర్‌ఘాట్, జూలై 19(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ దిల్‌సుఖ్‌నగర్ డిపోలో పనిచేస్తున్న 130మంది డ్రైవర్లు, కండక్టర్లు ప్రగతి చక్ర అవార్డులకు ఎంపికయ్యారని డిపో మేనేజర్ హరి తెలిపారు. శుక్రవారం దిల్‌సుఖ్‌నగర్ డిపోలో జరిగిన కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ వెంకన్నతో కలిసి డిపో మేనేజర్ ప్రగతి చక్ర అవార్డులను పంపిణీ చేశారు. డిపోలో పనిచేస్తున్న డ్రైవర్లు, కండక్టర్లు ప్రయాణికులకు మెరుగైన సేవలను అందించడంతోపాటు రోజువారి ఆదాయాన్ని పెంచడంలో చేసిన కృషిని గుర్తించి సంస్థ ఎండీ సజ్జనార్ ఆదేశాల మేరకు ప్రగతి చక్ర అవార్డులను అందజేసి ప్రోత్సహిస్తున్నట్లు హరి వివరించారు. ఈసందర్భంగా డిపోలో పనిచేస్తున్న సిబ్బందికి క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించి వారిలో మానసిక ఉల్లాసం, సంతోషం కలిగిస్తున్నట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో డిపో వెల్ఫేర్ కమిటీ సభ్యులు జీఎస్‌రెడ్డి, లలిత, సూపర్‌వైజర్లు బుచ్చిరెడ్డి, శృతి, మదన్, ఎంవీఎస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలకు గురికాకుండా చర్యలు

చంపాపేట, జూలై 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలకు గురికాకుండా తగు చర్యలు తీసుకోనున్నట్లు సరూర్‌నగర్ మండల తహసీల్దార్ వేణుగోపాల్ అన్నారు. హస్తినాపురం డివిజన్‌లోని నందనవనం ఆదర్శనగర్‌కాలనీలో సర్వే నెం 73/1లో ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌కు కేటాయించిన స్థలాన్ని కొందరు ఆక్రమించేందుకు ప్రయత్నించడాన్ని శుక్రవారం స్థానికులు ఫిర్యాదు చేయడంతో తహసీల్దార్ అడ్డుకున్నారు. తహసీల్దార్ మాట్లాడుతూ గతంలో పోలీస్‌స్టేషన్ నిర్మాణం కోసం ప్రభుత్వ స్థలం కేటాయించినట్లు, ఇందులో కొంత నిర్మాణ పనులు చేపట్టినట్లు, మిగిలి ఉన్న 240గజాల స్థలాన్ని ఇతరులు ఆక్రమించేందుకు పూనుకున్నట్లు తెలిపారు. మిగిలి ఉన్న స్థలంలో ప్రహరీ నిర్మాణ పనులు చేపట్టాలని ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్‌రెడ్డిని తహసీల్దార్ కోరారు. వెంటనే అక్కడ ప్రభుత్వ స్థలంగా పేర్కొంటూ బోర్డులు ఏర్పాటు చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

ఉపాధ్యాయుల పెండింగ్ బిల్స్‌ను క్లియర్ చేయాలి

- పీఆర్టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్‌యాదవ్

చంపాపేట, జూలై 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఉపాధ్యాయులకు రావాల్సిన పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని రంగారెడ్డి జిల్లా పీఆర్టీయూ టీఎస్ అధ్యక్షుడు గోవర్ధన్‌యాదవ్ కోరారు. పీఆర్టీయూ టీఎస్ సభ్యత్వ నమోదులో భాగంగా శుక్రవారం చంపాపేట డివిజన్‌లోని కర్మన్‌ఘాట్, చంపాపేట ఉన్నత పాఠశాలలతో పాటు సరూర్‌నగర్, రాజీవ్‌గాంధీనగర్, మన్సూరాబాద్, బహదూర్‌గూడ ఉన్నత పాఠశాలలను గోవర్ధన్‌యాదవ్ సందర్శించారు. ఉపాధ్యాయులను కలిసి ఆయన సభ్యత్వ పక్షోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు పీఆర్సీ 50శాతం ఫిట్మెంట్ వెంటనే ప్రకటించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీఆర్టీయూ టీఎస్ జిల్లా మాజీ గౌరవాధ్యక్షుడు కె.నారాయణగౌడ్, సరూర్‌నగర్ మండల శాఖ అధ్యక్షుడు రాజేశ్వర్‌రెడ్డి, గౌరవాధ్యక్షుడు మధుసూదన్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి నవీన్, కొత్తూరు మండల అధ్యక్షుడు విజయసాగర్, ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, రాష్ట్ర బాధ్యులు శ్రీధర్‌రెడ్డి, వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో చిన్నారులకు అక్షరాభ్యాసం

సరూర్‌నగర్, జూలై 19(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని బాలాపూర్‌లో గల అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం 'అమ్మ మాట-అంగన్‌వాడీ బాట' కార్యక్రమాన్ని నిర్వహించారు. మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి హాజరై కౌన్సిల్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్‌రెడ్డితో కలిసి చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. అంగన్‌వాడీ సిబ్బంది, కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

మూడేళ్లలోపు చిన్నారులను అంగన్‌వాడీలో చేర్పించాలి

సంతోష్‌నగర్: మూడేళ్లలోపు చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని సాయినగర్ కేంద్రం అంగన్‌వాడీ టీచర్ సుంచు పద్మిని తల్లిదండ్రులకు సూచించారు. శుక్రవారం శ్రీసాయినగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో చిన్నారులతో ప్రీ ప్రైమరీ చదువుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ సిబ్బంది బస్తీలోని ఇంటింటికి వెళ్లి చిన్నారుల తల్లిదండ్రులకు చదువు యొక్క ఆవశ్యకతల గురించి వివరించారు.


అక్షరాభ్యాసం చేయిస్తున్న మేయర్ పారిజాత, కార్పొరేటర్ ప్రభాకర్‌రెడ్డి